క్లుప్తంగా

వ్యక్తి కన్నా వ్యవస్థ ముఖ్యం



ఏపీఎన్‌జీవో సంఘ నాయకులను అభినందిస్తున్న ప్రభుత్వ ఐటీఐ ఉద్యోగులు

బాలాజీచెరువు: వ్యక్తి కన్నా వ్యవస్థ ముఖ్యమని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీ ఎన్‌జీవో సంఘ అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు, కార్యదర్శి పేపకాయల రామకృష్ణ పేర్కొన్నారు. జిల్లా ఎన్‌జీవో కార్యాలయంలో మంగళవారం సంఘ ఉద్యోగులు సమావేశమై సంఘ పటిష్ట కోసం కార్యాచరణ రూపొందించి ఈ ఏడాది చేపట్టే వాటిపై సమీక్షించారు. అనంతరం సంఘ నాయకులను ఐటీఐ ఉద్యోగులు అభినందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాస్, సహ అధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు రామచంద్రరావు, పాలపర్తి మూర్తి బాబు, కార్యనిర్వాహక కార్యదర్శి డి.డేవిడ్ ఏలిజియర్‌లు, నాయకులు రామప్రసాద్, వెంకటేశ్వర్లు, పీఎస్ ప్రకాశరావు, ఆర్‌వీ రమణ, శ్రీనివాస్, జీఎస్‌ఎస్‌చారి, జీఎస్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కార్యచరణ

కరప: గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి, గ్రామాభివృద్ధికి కార్యచరణ ప్రణాళిక రూపొందిస్తామని గ్రామ కార్యదర్శి వి.సునీల్ అన్నారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ఐకేపీ ఇచ్చిన నివేదిక ఆధారంగా పేదరిక నిర్మూలనకు, గ్రామంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేస్తామన్నారు. గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి మాట్లాడుతూ వివిధ శాఖల ద్వారా గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు.

పేకాట శిబిరంపై దాడి

కరప: మండలంలోని నడకుదురులో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి, ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.16,270 నగదు, ఐదు మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు. కరప మండలం నడకుదురు బాణసంచా తయారీ కేంద్రం సమీపంలో పేకాడుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. మంగళవారం సాయంత్రం కరప ఎస్ఐ ఎస్.రామకృష్ణ, స్పెషల్‌బ్రాంచ్ ఎస్ఐ మూర్తి, ఏఎస్ఎస్ పార్టీ, కరప పోలీసులు పేకాట శిబిరంపై దాడిచేశారు. అక్కడ పేకాడుతున్న ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, నగదు, మోటార్ సైకిళ్లను సీజ్‌చేసి, కరప పోలీసుస్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, నిందితులను కాకినాడ కోర్టులో హాజరుపరుస్తామని కరప ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

జూదం ఆడుతూ ఆరుగురి అరెస్టు

కాకినాడ రూరల్: మండలంలోని తూరంగి గ్రామంలో జూదం ఆడుతున్న ఆరుగురికి మంగళవారం అరెస్టు చేసినట్టు ఇంద్రపాలెం ఎస్సై నాగరాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. తూరంగి చేప చెరువు వెనక జూదం ఆడుతున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు పట్టుబడగా వారి నుంచి రూ.46,500 స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

వాకర్స్ ఉత్తమ అధ్యక్షుడిగా అడబాల రత్నప్రసాద్

కాకినాడ సిటీ: బోట్ క్లబ్ వాకర్స్ సంఘం అధ్యక్షుడిగా నిరంతరం పలు సేవా కార్యక్రమాలకు, అంతర్జాతీయ వాకర్స్ సంఘం ప్రకటించిన ఉత్తమ అధ్యక్షుడి పురస్కారాన్ని మంగళవారం కాకినాడ పార్లమెంట్ సభ్యులు వంగా గీత చేతుల మీదుగా అడబాల రత్నప్రసాద్ అందుకున్నారు. కాకినాడలో ఎంపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రత్నప్రసాద్ సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సంఘం ప్రతినిధులు బీహెచ్ రామకృష్ణంరాజు, రేలంగి బాపిరాజు, కె శ్రీరామరాజు, రాఘవరావు, డి.సుబ్రహ్మణ్యం, రాజా తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించండి

- గడపగడపకూలో కౌడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి
- పాల్గొన్న మాజీ మేయర్ శివప్రసన్న, కమిషనర్



గడపగడపకూ మన ప్రభుత్వంలో ప్రజలతో మాట్లాడుతున్న కౌడా ఛైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ శివప్రసన్న తదితరులు

కాకినాడ: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని నగరాభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి కోరారు. స్థానిక 10వ డివిజన్ దుమ్ములపేటలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. కౌడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, కమిషనర్ కె.రమేష్, ఇతర అధికారులు, నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూడున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రజలు పలు సమస్యలను వీరి దృష్టికి తీసుకురాగా సత్వరమే పరిష్కరించాల్సిందిగా అక్కడే ఉన్న అధికారులకు సూచించారు. కౌడా ఛైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చి ఇంకా సమస్యలు ఏమైనా ఉంటే తెలుసుకోవాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకూ మన ప్రభుత్వం ఏర్పాటు చేశారన్నారు. మాజీ మేయర్ సుంకర శివప్రసన్నసాగర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలిచారన్నారు. ఇటువంటి సీఎం మళ్లీ అధికారంలోకి రావాలనే ఆకాంక్ష అన్ని వర్గాల ప్రజల్లో కనిపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ డైరెక్టర్ వాసుపల్లి కృష్ణ, మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయ్ కుమార్, పసుపులేటి వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు మోసా పేతూరు, ఎరిపల్లి సీతారామ్, తిరిధి జగన్నాథం, మాజీ కార్పొరేటర్లు నల్లబిల్లి సుజాత,చవ్వాకుల రాంబాబు, కర్రి శైలజ, కొప్పనాతి సత్యనారాయణ, కంపర బాబి, నగర బీసీ సెల్ అధ్యక్షుడు పేర్ల రజనీ కుమార్, డీఈ మాధవి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలకు అత్యధిక ప్రాధాన్యం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో ప్రభుత్వం వైద్య సేవలకు అత్యధిక ప్రాధాన్యమిస్తోందని, ఆరోగ్య శ్రీ వర్తించని వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆదుకుంటున్నామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కాకినాడ రూరల్ నియోజవర్గ పరిధిలోని 13 మందికి మంజూరైన రూ.9.25 లక్షలకు సంబంధించిన చెక్కులను ఆయన రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వలవల వెంకటేశ్వరరావు, సూరాడ రాజు, యాళ్ల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



శ్రీనివాస కల్యాణం నృత్యరూపక ప్రదర్శనలో పాల్గొన్న శ్రీసూర్య నృత్యనికేతన్ విద్యార్థులు

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో సంస్థ 52 వ వార్షికోత్సవం, ధనుర్మాస ఉత్సవాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం సంస్థ అధ్యక్షుడు గోపాలనర్సరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ వేడుకలు ప్రారంభించారు. శ్రీసూర్య నృత్యనికేతన్ నాట్యాచారిణి మహాలక్ష్మి, విద్యార్థులు నృత్యరూపకాలు ప్రదర్శించారు. వీరు శ్రీనివాస కల్యాణం, అన్నమయ్య కీర్తనలు, గొబ్బిళ్లు తదితర నృత్యప్రదర్శనలు చక్కని హావభావాలతో చేసి ప్రేక్షకులను ఆకట్టుకొన్నారు. సత్కళావాహిని సభ్యులు సామూహిక విష్ణుసహస్ర నామావళి, హనుమాన్ చాలీసా పారాయణం భక్తి శ్రద్ధలతో చేశారు. దాతల సహకారంలో వేడుకలు నిర్వహిస్తున్నామని అన్నారు. నాట్యాచారిణి మహాలక్ష్మిని సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంగీత విద్వాంసులు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు, సత్కళావాహిని సభ్యులు సత్కరించారు. నాట్యప్రదర్శనలో పాల్గొన్న 35 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మణిబాబు,రామకృష్ణ, శారదాదేవి, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇలాగేనా నిర్వహణ?

పీఆర్‌జీ గ్రాడ్యుయేషన్ వేడుకల నిర్వహణపై కమిషనర్ అసంతృప్తి

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన 14, 15 గ్రాడ్యుయేషన్ డే వేడుకల నిర్వహణపై కాలేజ్ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మూడేళ్ల విద్యనభ్యసించిన డిగ్రీ విద్యార్థులు దాదాపు 500 మందికి పైగా పట్టాలు తీసుకోవడానికి హాజరుకాగా పది మందికి మాత్రమే అందజేసి కార్యక్రమం నుంచి అర్ధాంతరంగా నిష్క్రమించారు. గ్రాడ్యుయేషన్ వేడుకలకు ముందు కళాశాల ఆవరణలో ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవం వంటి అదనపు కార్యక్రమాలు నిర్వహించడం, అలాగే గ్రాడ్యుయేషన్ వేడుకలకు కుటుంబ సభ్యులతో హాజరైతే కనీస వసతులు ఏర్పాట్లు చేయకపోవడం, స్వాగత ఏర్పాటు చేసిన వాయిద్యాలు లేటుగా రావడంపై కళాశాల ప్రిన్సిపాల్‌పై మండిపడ్డారు. వేడుకల నిర్వహణపై ప్రోగ్రామ్ షెడ్యూల్ లేకపోవడం, ముఖ్యంగా మీడియాకు వేడుకల నిర్వహణ, హాజరయ్యే అతిథుల సమాచారం తెలపకపోవడంపై మండి పడ్డారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నన్నయ్య వీసీ జగన్నాథరావు, జేడీ డేవిడ్ కుమార్ స్వామిని ఆహ్వానించగా వారు కూడా కార్యక్రమానికి హాజరుకాలేదు. దీంతో కార్యక్రమం మిగిలిన వారితో మొక్కుబడిగా ముగించడంతో విద్యార్థులతో పాటు కొంతమంది అధ్యాపకులు నిరుత్సాహపడ్డారు.

డైనింగ్ హాల్ ప్రారంభం



డైనింగ్‌హాల్‌ను ప్రారంభిస్తున్న కౌడా ఛైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ శివప్రసన్న

కాకినాడ: కాకినాడ డీప్‌వాటర్ పోర్టులో ఎగుమతులు, దిగుమతులు సాగిస్తున్న కేఎస్‌పీఎల్ సంస్థ దుమ్ములపేట పాఠశాలలో రూ.40 లక్షల సీఎస్సార్ నిధులతో నిర్మించిన డైనింగ్‌హాల్‌ను కౌడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ శివప్రసన్న, కమిషనర్ కె.రమేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌడా ఛైర్ పర్సన్ చంద్రకళాదీప్తి మాట్లాడుతూ విద్యారంగ ప్రగతికి విద్యార్థుల అభ్యున్నతికి కేఎస్‌పీఎల్ వంటి సంస్థలు అందిస్తున్న తోడ్పాటు అభినందనీయమన్నారు. మాజీ మేయర్ సుంకర శివప్రసన్న మాట్లాడుతూ గతంలో కేఎస్‌పీఎల్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పాటునిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, కేఎస్‌పీఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మురళీధర్, జీఎం ఆపరేషన్స్ జాకబ్ సత్యరాజు, ఎస్ఈ సత్యకుమారి, డీఈ మాధవి, ఏఈ నాగేశ్వరరావు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యపరిరక్షణ



విద్యార్థులు భోజనాలు చేయడాన్ని పరిశీలిస్తున్న డివిజనల్ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్‌నాయక్

కరప: ఆరోగ్య పరిరక్షణకు వ్యక్తిగత శుభ్రతతో పాటు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డివిజనల్ వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలోని మహాత్మజ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయంలో మంగళవారం ఆయన వైద్య సిబ్బందితో కలిసి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ శ్రీనివాస్‌నాయక్ హాస్టల్ ఆవరణ, వంటషెడ్డు, టాయ్‌లెట్లను పరిశీలించారు. ఎప్పటికప్పుడు క్లీన్ చేయించి, ఫినాయిల్ చల్లించాలని, కాయకూరలు కుళ్లిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచనలు చేశారు. బియ్యం బాగుండక అన్నం బాగుండటంలేదని విద్యార్థులు తెలిపారు. బియ్యాన్ని పరిశీలించి, అధికారుల దృష్టికి తీసుకెళ్లి మంచి బియ్యం వచ్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి వైద్యాధికారి సూచనలు చేశారు. పదినెలలుగా గురుకుల పాఠశాలకు పూర్తిస్థాయి ప్రిన్సిపాల్ లేక, హాస్టల్ నిర్వహణ బాగుండడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పూర్తిస్థాయి ప్రిన్సిపాల్ నియమించేందుకు, హాస్టల్ విద్యార్థులు నేలపై కూర్చొని భోజనాలు చేయాల్సి వస్తోందని, డైనింగ్ హాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పారదర్శకంగా రీ సర్వే పూర్తి చేయాలి

కాకినాడ: జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకంలో భాగంగా జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ సంబంధిత సిబ్బంది సూచించారు. ఈ విషయమై మంగళవారం స్థానిక స్మార్ట్ సిటీ కార్యాయంలో సచివాలయ అడ్మిన్లు, ప్లానింగ్ సెక్రటరీలతో సమావేశం ఏర్పాటు చేశారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఏసీపీ నాగశాస్త్రులు, సర్వేయర్ ఆచారి ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రీ సర్వేలో ప్రతి సర్వే నంబర్‌లోని ఆస్తులన్నింటిని నిర్ధారణ చేసుకుని ప్రతి ఒక్క భూమి రికార్డుల్లో నమోదయ్యేలా సిద్ధం చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి ఆన్‌లైన్ చేసుకునే విధానంపై త్వరలోనే మార్గదర్శకాలు జారీ అవుతాయని, ఈలోపు మాస్టర్ ట్రైనర్లు ద్వారా డేటాను నమోదు చేసే అంశంపై సంబంధిత సిబ్బంది పూర్తి అవగాహన కల్పించుకోవాలని కమిషనర్ సూచించారు. రీ సర్వే వల్ల అనేక భూ వివాదాలకు, సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉన్నందున ఈ విషయంలో సిబ్బంది పూర్తి అవగాహనతో సమర్థంగా పనిచేయాలని కోరారు. ఇచ్చిన లాగిన్‌లో ఎలా నమోదు చేయాలనే అంశంపై ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు.

9 నుంచి ఐటీఐ బ్రిడ్జి కోర్సు ప్రారంభం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఐటీఐ రెండేళ్ల ఉత్తీర్ణులైనవారు పాలిటెక్నిక్ రెండవ ఏడాది నేరుగా ప్రవేశం పొందడానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు సన్నద్ధం చేసేందుకు బ్రిడ్జి కోర్సు నిర్వహిస్తున్నారు. ఐటీఐ ప్రిన్సిపాల్..కోర్సు జిల్లా కన్వీనర్ వేణుగోపాల వర్మ మంగళవారం ఈ విషయం తెలిపారు. 9వ తేదినుంచి తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు కాకినాడ ఐటీఐ కళాశాలలో సంప్రదించవచ్చన్నారు. వివరాలకు 8919656139 నంబరును సంప్రదించవచ్చని సూచించారు.

కాకినాడ నేతలతో సీఎం జగన్ సెల్ఫీ



కాకినాడ: రాజమహేంద్రవరం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ జిల్లాకు చెందిన పార్టీ నేతలతో సెల్ఫీ దిగారు. పర్యటనకు విచ్చేసిన ఆయనకు కాకినాడ జిల్లా పార్టీ అధ్యక్షుడు కురసాల కన్నబాబు, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ ఛైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ శివప్రసన్న విజ్ఞప్తి మేరకు పై నేతలందరితో సీఎం జగన్ సెల్ఫీ దిగారు.

ఆశ వర్కర్లు ప్రజలకు మంచి సేవలు అందించాలి



తూరంగి పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్

కాకినాడ సిటీ: గ్రామీణ ప్రాంతాల్లో ఆశా వర్కర్లు ప్రజలందరికీ మంచిసేవలు అందించాలని అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఆశా వర్కర్లకు సూచించారు. మంగళవారం ఆయన తూరంగిలో పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించి అక్కడ జరుగుతున్న ఆశ డే సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అక్కడ ఉన్న ఆశ వర్కర్లను వారి విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో పేషంట్స్‌కు అందుతున్న సేవలను అడిగిన ఆయన ప్రతి పేషంట్ వివరాలను అడిగి తెలుసుకుని వారి ఆరోగ్య వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. సచివాలయం ఏఎన్ఎంలు ఎప్పటికప్పుడు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పేషంట్స్‌ను పాలో అప్ చేసి ఆరోగ్యంగా ఉండేలా చేయాల్సిన బాధ్యత వహించాలన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ పీహెచ్‌సీలోని లేబర్ రూమ్, లేబరేటరీ, ఫార్మసీ, వాక్సినేషన్ నిల్వలు, ఐఎల్ఆర్ తదితర వాటిని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శాంతిప్రభ, జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ రమేష్, డాక్టర్లు కె.సత్యనారాయణ, ఐ.ప్రభాకర్, పీహెచ్‌సీ వైద్యాధికారి వి.ప్రశాంతి, ఆఫీసు సిబ్బంది డీవీ వసుధర, సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా సకాలంలో సేవలు అందించాలి

కాకినాడ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా గ్రామ సచివాలయాల ద్వారా పౌర సేవలను సకాలంలో అందించాలని కాకినాడ డివిజన్ అభివృద్ధి అధికారి పాఠంశెట్టి నారాయణ మూర్తి కోరారు. కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, గ్రామ సచివాలయ కార్యదర్శులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారా సేవల్లో వెనకబాటును ఉపేక్షించబోమన్నారు. ప్రతి అర్జీకి సకాలంలో సర్వీసు ఉండాలన్నారు.

హౌసింగ్‌పై సమీక్ష

పేదలకు ప్రభుత్వం అందజేసిన పట్టా స్థలాల్లో గృహ నిర్మాణాలపై హౌసింగ్ ఏఈ నాగభూషణం, ఎంపీడీఓ శ్రీనివాసరావులతో కలిసి గ్రామ సచివాలయ కార్యదర్శులతో డీఎల్‌డీఓ నారాయణమూర్తి సమీక్షించారు.

పందుల పెంపకం స్థల పరిశీలన

కాకినాడ సిటీ: కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాలపై కాకినాడ రూరల్ మండలం ఉప్పలంకలో ఎరుకల కులస్తులు పందులు పెంచుకునేందుకు కేటాయించిన ఐదెకరాల స్థలంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ మండల అధికారులు, పంచాయతీ అధికారులతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఉప్పలంక పంచాయతీ సెక్రటరీ నాగేంద్ర ప్రసాద్ సారథ్యంలో రోడ్డుకు సంబంధించి ఎస్టిమేషన్ పనులు చేపట్టారు. కాకినాడ-యానాం రోడ్డు ప్రధాన రహదారిలో ఉప్పలంక సెంటర్ నుంచి ఐదెకరాల స్థలంలోకి వెళ్లేందుకు రహదారి మార్గాన్ని జిల్లా పంచాయతీ అధికారి విక్టర్, ఈఓపీఆర్డీ సలాది శ్రీనివాసరావు పరిశీలించారు.

నాణ్యత లేని వంట నూనె వాడితే కఠిన చర్యలు



అమ్మ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లో వంట నూనె తనిఖీ చేస్తున్న జిల్లా ఆహార సహాయ నియంత్రణ అధికారి శ్రీనివాస్

బోట్‌క్లబ్(కాకినాడసిటీ): నాణ్యత లేని వంట నూనెలు వాడితే వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని జిల్లా ఆహార సహాయ నియంత్రణ అధికారి బి. శ్రీనివాస్ హోటల్ యజమానులకు సూచించారు. మంగళవారం కాకినాడలోని పలు హోటల్‌లోని వంట నూనెలను ఆయన పరిశీలించారు. స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లోని పెద్దిరెడ్డి కేటరింగ్ సెంటర్, వరహాలు టిఫిన్ సెంటర్, భానుగుడి సెంటర్‌లోని ఖైదీ రెస్టారెంట్, శ్రీయతిఫుడ్స్, మహేంద్ర మిఠాయివాలా, కోకిలసెంటర్‌లోని కామాక్షి హాట్‌ఫుడ్స్, అమ్మ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో వాడుతున్న వంట నూనెలను ఆయన పరిశీలించారు. టోటల్ పోలార్ కౌంట్ మెషీన్ ద్వారా వంట నూనెలను పరిశీలించారు. రంగుమారిన నూనెలు వినియోగించి ఆహార పదార్థాలు తయారు చేస్తే ఆకస్మిక తనిఖీలు చేసి వారిపై కేసులు నమోదు చేసి జాయింట్ కలెక్టర్ కోర్టుకు తరలిస్తామన్నారు. మెషీన్‌లో 30 శాతం దాటి రీడింగ్ వస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నాగూల్‌మీరా పాల్గొన్నారు.

భార్యపై అలిగి ఆత్మహత్య

కాకినాడ రూరల్: భార్య తరచూ పుట్టింటికి వెళ్లడంతో అలిగిన భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తూరంగి మహాలక్ష్మినగర్‌లో చోటు చేసుకుంది. ఇంద్రపాలెం పోలీసుల కథనం ప్రకారం.. మహాలక్ష్మినగర్‌లకు చెందిన మత్స్యకారుడు అంగాడి శ్రీనివాస్(30) సోమవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీనివాస్‌కు భార్య, ముగ్గురు పిల్లలు. సముద్రంలో చేపల వేట ద్వారా జీవనోపాధి పొందుతున్నాడు. భార్య తరచూ గొడవ పడుతూ పుట్టింటికి వెళ్లి పోతుండడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో ఆత్మహత్యకు పాల్పడగా తండ్రి గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై నాగరాజు తెలిపారు. మృత దేహానికి పీఎం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని, శ్రీనివాస్ ఆత్మహత్యపై విచారణ చేపడుతున్నామన్నారు.

బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

బోట్‌క్లబ్: స్థానిక పీఆర్ బాలికోన్నత పాఠశాల్లో రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దంత, నేత్ర వైద్యశిబిరాన్ని మంగళవారం రోటరీ గోల్డెన్‌జూబ్లీ క్లబ్ అధ్యక్షుడు జీవీ కృష్ణప్రకాష్ ప్రారంభించారు. క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలలను దత్తత తీసుకొని హ్యాపీ స్కూల్స్ ప్రాజెక్టులో అభివృద్ధి చేస్తామన్నారు. నయన కంటి ఆసుపత్రి అధినేత రావుల శ్రీరామ్, భవానీ డెంటల్ హాస్పిటల్ అధినేత సతీష్ ఆధ్వర్యంలో 350 మంది బాలికలకు కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వద్దాది ఆదిత్య, సభ్యులు ముత్తా నవీన్, మైలవరపు సత్యనారాయణ, బుచ్చిరెడ్డి, ధనసాగర్‌ప్రసాద్, భూపేంద్ర, సత్యపాల్, నేతి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళులు



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఐక్య వేదిక నాయకులు



కరప హైస్కూలులో సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ, ఏఈఓ, ఉపాధ్యాయులు

కాకినాడ సిటీ: ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం సావిత్రిభాయి పూలే 192వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ జీజీహెచ్ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరంలో మాతా సావిత్రీబాయి పూలే విగ్రహాన్ని ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేయాలన్నారు. సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రీబాయిపూలే జీవిత చరిత్ర పుస్తకాన్ని ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు పప్పు దుర్గారమేష్, చొల్లంగి వేణుగోపాల్, పిట్టా వరప్రసాద్, యాళ్ల శివప్రసాద్, హసన్ షరీఫ్, రంబాల సతీష్ జగ్గారపు మల్లికార్జున్, తాళ్లూరు రాజు, కేవీవీ నారాయణమూర్తి కె.సతీష్, దొడ్డి వీరేంద్ర, అనుసూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించడం మన సంప్రదాయం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయమని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాద్‌రాజు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో మంగళవారం నిర్వహించిన సావిత్రిబాయ్ పూలే 192వ జయంతి వేడుకల్లో పాల్గొని ఆమె సేవలను కొనియాడారు. విద్యార్థినులు ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సావిత్రిబాయ్ పూలే చారిట్రబుల్ ట్రస్ట్ ఛైర్మన్ గుడూరు సీతామహాలక్ష్మిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ రమణ, రిజిస్ట్రార్ సుమలత, వర్సిటీ డైరెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

కరప: సావిత్రీబాయి పూలేను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలికల కోసం పాఠశాలను స్థాపించి, భర్త జ్యోతిబా పూలేతో కలిసి విద్యాబోధన చేసి, పేదలఅభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి, ఉపాధ్యాయులతో కలిసి సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎంపీపీ శ్రీలక్ష్మి, ఎంఈఓ బుల్లికృష్ణవేణి, స్టాఫ్‌సెక్రటరీ శశికళను ఉపాధ్యాయులు సత్కరించారు. తర్వాత ఎంపీపీ శ్రీలక్ష్మి, ఎంఈఓ బుల్లికృష్ణవేణి వలసపాకల, వేళంగి, గొడ్డటిపాలెం తదితర గ్రామాల్లో పర్యటించి, సావిత్రీబాయి పూలే జయంతి వేడుకల్లో పాల్గొని నివాళులర్పించారు. హెచ్ఎం యు.లీలామనోహర్, వలసపాకల సర్పంచ్ వాసంశెట్టి రామారావు, మండల ఎస్సీనాయకుడు సవిలే రాజేష్ పాల్గొన్నారు.

సాంబమూర్తి వికలాంగుల బాలికల పాఠశాలలో..

కాకినాడ సిటీ: కాకినాడ నగరంలోని సాంబమూర్తి వికలాంగుల బాలికల పాఠశాలలో ఐద్వా నగర కమిటీ ఆధ్వర్యంలో సావిత్రి బాయిపూలే 192వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సమాజంలో రుగ్మతలు, మూఢనమ్మకాలు పోవాలంటే ప్రతి ఒక్కరూ చదువుకోవాలనే దృక్పథంతో ఎన్నో కష్టాలు ఎదుర్కొని మహిళలకు, వెనుకబడిన వర్గాలకు విద్యనందించిన మహోన్నత వ్యక్తి సావిత్రిబాయి పూలే అన్నారు. ఆమె భర్త జ్యోతిరావు పూలేతో కలిసి వాడవాడలా పాఠశాలలు నెలకొల్పి మూఢనమ్మకాలు, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడిన వారిని ఆదర్శంగా తీసుకుని చదువుతోపాటు సమాజంపై బాధ్యతగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి కె. నాగజ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు బి శ్రీదేవి, జి పద్మ, ఎస్ మసేనమ్మ, డి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మూడు కుటుంబాలకు చేయూత



గుండె వ్యాధి బాధితుడు వీర్రాజుకు మందులు అందజేస్తున్న వీరభద్రారెడ్డి

కాకినాడ క్రైం: ఆర్థిక భరోసా, ఆరోగ్య భద్రత లేని మూడు కుటుంబాల్లోని వ్యక్తులకు శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ చేయూతనిచ్చింది. వీరభద్ర ఎక్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధినేత ద్వారంపూడి వీరభద్రారెడ్డి సంస్థ తరపున అందించిన సీఎస్ఆర్ నిధుల నుంచి ఈ సహకారం అందించినట్టు శ్రీ యువసేన వ్యవస్థాపకుడు బొల్లం సతీష్ అన్నారు. కాకినాడ సంధ్యానగర్‌కు చెందిన వీర్రాజు అనే వ్యక్తి గుండె, ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతినడంతో అతడికి ఏడాది పాటు మందుల కోసం ప్రతి నెలా రూ.ఆరు వేల మొత్తాన్ని సాయంగా అందించాలని నిర్ణయించారు. కాకినాడ సూర్యనారాయణపురానికి చెందిన భవానీ ప్రసాద్ అనే దివ్యాంగ యువకుడు తన కాళ్లమీద తాను నిలబడే ప్రయత్నంలో భాగంలో ఉద్యోగం సాధించగా విధి నిర్వహణ కోసం ల్యాప్‌టాప్ అవసరం కావడంతో అతడికి రూ.30 వేల విలువైన ల్యాప్‌టాప్‌ను శ్రీయువసేన సమకూర్చింది. అలాగే కాకినాడ ఏటిమొగకు చెందిన పేద విద్యార్థిని ధనకుమారి చదువు కోసం రూ.23 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ నిధులన్నింటినీ ద్వారంపూడి వీరభద్రారెడ్డి తన సంస్థ వీరభద్ర ఎక్స్ పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నుంచి సమకూర్చిన సీఎస్ఆర్ నిధుల నుంచి అందజేశామని సతీష్ చెప్పారు. వీటిని మంగళవారం లబ్ధిదారులకు వీరభద్రారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్రి వీర్రెడ్డి, సోము స్వాతి, రాజ్‌కుమార్, మున్నా, వెంకటేష్, తేజ, శాండీ పాల్గొన్నారు.